నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 24 జూన్ 2024 SANGAREDDY

## మల్లన్న ఆలయ ఉద్యోగుల డిష్యుం డిష్యుం

చేర్యాల, జూన్ 23 : కొందరు ఉద్యోగులు కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. ఆలయంలో కొందరు ఉద్యోగుల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా విబేధాలు తారాస్థాయికి చేరాయి. ఆలయ ఉద్యోగులు ద్వితీయ శ్రేణి కొన్ని రోజులుగా వివిధ వ్యక్తుల పేరు మీద ఒకరిపై మరొకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ఉద్యోగుల్లో సఖ్యత కోసం ఈవో బాలాజీ ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఏఈవో గంగా శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అంజయ్య మధ్య మాటామాట పెరిగింది. అక్కడే ఉన్న ప్లంబర్ విజయ్ గొడవలో కలుగజేసుకున్నాడు. ఈ క్రమంలో ఏఈ అంజయ్య చెంపను ఏఈవో శ్రీనివాస్ చెల్లుమనిపించాడు. వెంటనే శ్రీనివాస్‌పైకి అంజయ్య కుర్చీ లేపాడు. అక్కడే ఉన్న సహచర ఉద్యోగులు వారిద్దరిని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆలయ ఈవో బాలాజీ ఇరువురిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడవ అనంతరం అంజయ్యకు శ్రీనివాస్ క్షమాపణలు చెప్పారు. ఆలయ ఉద్యోగుల మధ్య విబేధాలు తీవ్రస్థాయికి చేరి గొడవ వరకు వెళ్లి రచ్చకెక్కడంతో భక్తులు పెదవి విరుస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గుట్టుగా డ్రగ్స్ దందా..!

- మూతపడిన పరిశ్రమలు, పాడుబడ్డ భవనాలు, కోళ్ల ఫారాలే తయారీ కేంద్రాలు
- ఏడు నెలల వ్యవధిలో మూడు డ్రగ్స్ కేంద్రాలపై దాడులు
- టీజీ న్యాబ్, పోలీసుల నిఘాతో రట్టవుతున్న గుట్టు
- తక్కువ సమయంలో కోటీశ్వరుల కావాలన్న అత్యాశతో దందా
- వలస కార్మికులు, యువతను మత్తు పదార్థాలకు బానిసలు చేస్తున్న అక్రమార్కులు



గుమ్మడిదల:కొత్తపల్లిలో అక్రమంగా తయారు చేస్తున్న డ్రగ్స్ నిర్వాహణను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్, న్యాబ్ అధికారులు(ఫైల్)

గుమ్మడిదల, జూన్ 23: నిషేధిత మాదక ద్రవ్యాలను తయారుచేసి తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలన్న దురుద్దేశంతో అక్రమార్కులు డ్రగ్స్ తయారీకి పాలు పడుతున్నారు. పగలంతా జల్సాలు చేస్తూ రాత్రి వేళలో డ్రగ్స్ తయారు చేస్తున్నారు. నిషేధిత డ్రగ్స్ ఆల్ఫాజోలం, డైజోఫాం మత్తు పదార్థాలను తయారుచేస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. మారుమూల ప్రాంతాలు, మూతపడిన పరిశ్రమలను, పాడుబడ్డ భవనాలు, కోళ్ల ఫారాలను కేంద్రాలుగా మార్చుకుని తయారుచేస్తున్నారు. న్యాబ్ అధికారులు, పోలీసులు సంగారెడ్డి జిల్లాలో ఏడు నెలల్లో మూడు డ్రగ్స్ తయారీ కేంద్రాలను గుర్తించి వాటిని గుట్టురట్టు చేశారు. కోట్లాది రూపాయల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని పారిశ్రామికవాడలైన పాశమైలారం, ఫసల్వాది, బొల్లారం, బొంతపల్లి, గడ్డపోతారం, కాజీపల్లి తదితర పారిశ్రామికవాడల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది కార్మికులుగా పనిచేస్తున్నారు. వలస కార్మికులు, విద్యార్థులు, యువతను టార్గెట్ చేసి మత్తు పదార్థాలను అంటగట్టి వాటికి బానిసలుగా చేస్తున్నారు. ఆల్ఫాజోలం, డైజో ఫామ్ వంటి మత్తు పదార్థాలను తయారు కల్లు దుకాణాల్లో విక్రయించి బాగా డబ్బులు సంపాదిస్తున్నారు.

### చిన్నపాటి పరిశ్రమలే నిషేధిత డ్రగ్స్ కేంద్రాలు..

చిన్నపాటి కేంద్రాలు ఏర్పాటు చేసుకుని డ్రగ్స్ తయారీ చేస్తున్నారు. ఇందులో చిన్న రియాక్టర్, యంత్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. రసాయన పరిశ్రమల్లో పనిచేస్తున్న కెమిస్ట్‌లు, డ్రగిస్ట్‌లకు డబ్బులు ఆశ చూపి మత్తు పదార్థాలు తయారుచేయిస్తున్నారు. మూతపడిన పరిశ్రమలు, పాడుబడ్డ భవనాలు, కోళ్ల ఫారాలు, జనసంచారం లేని ప్రాంతాలను ఎంచుకుని యథేచ్ఛగా డ్రగ్స్ తయారీకి చేస్తున్నారు. ఎవరూ గుర్తుపట్టలేని విధంగా పగలంతా కోళ్లఫారం నిర్వహిస్తూ, రాత్రివేళలో డ్రగ్స్ తయారీ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామశివారులో కోళ్ల ఫారం అడ్డాగా చేసుకుని తయారుచేస్తున్న డ్రగ్స్ కేంద్రాన్ని గుర్తించి న్యాబ్ అధికారులు, పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో రూ.కోటి విలువ చేసే ఆల్ఫాజోలం పట్టుకుని, నిందితులను అరెస్ట్ చేశారు.

### జిల్లాలో సీజ్ చేసిన డ్రగ్స్ కేంద్రాల వివరాలు..

- సంగారెడ్డి జిల్లాలోని ఫసల్వాది గ్రామశివారులో గతేడాది డిసెంబర్‌లో ఓ ఇంట్లో నిషేధిత ఆల్ఫాజోలం తయారు చేస్తున్న ముఠాను టీజీన్యాబ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడిచేసి రూ.70లక్షల విలువైన మత్తు పదార్థాలు,ముడి సరుకు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.
- జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో నార్థజీపమ్ డ్రగ్స్‌ను డిసెంబర్‌లో నార్కోటిక్స్ బ్యూరో అధికారులు, పోలీసులు దాడి చేసి ముఠాను అరెస్ట్ చేశారు.
- మూడు రోజుల క్రితం గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామశివారులో జనసంచారం లేని ప్రాంతంలో వ్యవసాయభూమిని లీజ్‌కు తీసుకుని కోళ్లఫారం నిర్వహిస్తూ ఆల్ఫాజోలం తయారు చేస్తున్న ముఠాను పట్టుకున్నారు. రూ. కోటి విలువ చేసే ఆల్ఫాజోలం, ముడిసరుకులు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

### కఠినంగా వ్యవహరిస్తాం..



డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి టీజీ న్యాబ్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో తీవ్రంగా కృషిచేస్తున్నాం. నిషేధిత మత్తు పదార్థాల తయారీ, వాడకం రెండూ నేరమే. డ్రగ్స్ తయారు చేసిన వారిపై, వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గుట్టుచప్పుడు కాకుం డా ఎక్కడైనా నిషేధిత మత్తు పదార్థాలు తయారుచేస్తుంటే పోలీసులకు సమాచారం ఇస్తే దాడులు చేసి చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. ప్రజలు ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. జిల్లాలో నిఘా పెట్టి డ్రగ్స్ నిర్మూలకు చర్యలు తీసుకుంటున్నాం.

–చెన్నూరి రూపేశ్, ఎస్పీ, సంగారెడ్డి జిల్లా



### మొదలైన కరెంట్ కష్టాలు..



రాయపోల్, జూన్ 23 : కాంగ్రెస్ పాలన అంటేనే కరెంట్ కష్టాలు ఉంటాయి. పదేండ్ల కిందటి వరకు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం ఎన్నో కష్టాలు పడ్డాం. పగలు, రాత్రి తేడా లేకుండా పొలాల వద్ద కరెంట్ కోసం పడిగాపులు కాసినం. తెలంగాణ ఏర్పడి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కరెంట్ కష్టాలు తీరాయి. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ ఇవ్వడంతో రెండు పంటలు సాఫీగా సాగు చేసుకున్నాం. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే కరెంట్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. దీంతో బోరు బావుల వద్ద నాట్లు వేయాలా వద్దా అని ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-ఉమ్మడి నర్సిహ్మారెడ్డి, దౌల్తాబాద్

### కేసీఆర్ సార్ ఉన్నప్పుడు కరెంట్‌కు ధోకా లేకుండే



తెలంగాణ రాక ముందు కరెంట్ ఎట్ల ఉండే గిప్పుడు గదే పరిస్థితి నెలకొంది. కేసీఆర్ సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరెంట్ గురించి ఆందోళన లేకుండే. సార్ ఏం చేసిండో ఎమో కానీ మనకు కరెంట్ సమస్య లేకుండా చేసిండు. గిప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందో లేదా కరెంట్‌కు మళ్లీ పాత రోజులు వచ్చాయి. సార్ ఎన్నికల అప్పుడు చెప్పిండు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ కష్టాలు తప్పవని గిప్పుడు సార్ చెప్పిందే నిజం కాబట్టే. కేసీఆర్ సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరెంట్‌కు ఢోకా లేకుండే.

- వరుగంటి గణేశ్, గురువన్నపేట, కొమురవెల్లి

### ఇక పరిశ్రమలకు కరెంట్ కష్టాలేనా?



తెలంగాణ ఏర్పడక ముందు పరిశ్రమలకు పవర్ హాలీడే వచ్చాయి. దీని వల్ల పారిశ్రామికవేత్తలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పరిశ్రమలు, రైతులకు నిరంతరంగా కరెంట్ సరఫరా చేశారు. పదేండ్లలో కరెంట్ కష్టాలు లేవు. దీంతో మంచి రోజులు వచ్చినాయని సంతోషపడ్డాం. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో అటు రైతులకు, పరిశ్రమలు కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. ఎప్పుడు పోతదో తెలియదు. ఎప్పుడు వస్తదో తెలియకుండా ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, పరిశ్రమలకు నిరంతరంగా కరంట్ సరఫరా చేస్తేనే రాష్ట్రం ముందడుగు వేస్తది.. లేదంటే రాష్ట్రం దివాలా తీస్తది.

-చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, పారిశ్రామికవేత్త, గుమ్మడిదల మండలం

### కరెంటు ఎప్పుడు ఉంటుందో తెలియదు..



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. కేసీఆర్ సార్ సీఎంగా ఉన్నప్పుడు ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కాలేదు. నిరంతరంగా కరెంటు ఉండేది. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. కరెంటు సరిగా లేకపోవడంతో రైతులందరూ ఇబ్బందులు పడుతున్నారు.

- ప్రకాశ్, వెంకటాపూర్ రైతు, కోహీర్ మండలం

### కేసీఆర్ హయాంలోనే ఫుల్ కరెంట్



రాయపోల్,జూన్ 23 : కేసీఆర్ హయాంలో పదేండ్లు కరెంట్ ఫుల్లుగా వచ్చింది. 2014 కంటే ముందు కరెంట్ కోసం ఎంత తిప్పలైందో గుర్తుకు వస్తుంది. రాత్రిళ్లు మోటర్లకాడనే పడుకొని ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. కేసీఆర్ వచ్చినంక కరెంట్‌కు రంది లేకుండా గడిపినం. ఇప్పుడేమో మళ్లీ పాతరోజులు గుర్తుకు వస్తున్నాయి. వానకాలం సాగు చేద్దామంటే కరెంట్ ఇబ్బందులు ఉండడంతో పాటు వర్షాలు కురువక అకాశం వైపు చూస్తున్నాం. ఉన్న నీటిని పారించి సాగు చేద్దామన్నా.. కరెంట్ తిప్పలు తప్పడం లేదు. రాను రానూ మరిన్ని కరెంట్ కోతలు వస్తాయని భయంగా ఉన్నది.

-లింగాయపల్లి యాదగిరి,రాయపోల్ జడ్పీటీసీ

# ట్రస్ట్‌బోర్డు నియామకానికి పోటాపోటీ



కొమురవెల్లి మల్లన్న ఆలయం

- కొమురవెల్లి 'మల్లన్న' ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుపై మంత్రుల నజర్
- మంత్రులను ప్రసన్నం చేసుకుంటున్న నాయకులు
- పార్టీకోసం పనిచేసిన వారికి పదవులు ఇవ్వాలని కోరుతున్న కాంగ్రెస్ క్యాడర్

చేర్యాల, జూన్ 23 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకం రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే మల్లన్న ఉత్సవాలు ప్రారంభం కావడంతో 20మంది సభ్యులతో నాలుగు నెలల పదవి పాటు జంబో కమిటీని ప్రభుత్వం నియమించింది. స్వామివారి ఉత్సవాలు ముగియడంతో ప్రభుత్వం కమిటీ నియామకానికి తిరిగి గ్రీన్‌స్నిగల్ ఇచ్చింది. ఎంపీ ఎన్నికల కోడ్ రావడంతో తిరిగి కమిటీ దరఖాస్తులు, నియామకం నిలిచిపోయాయి. ప్రస్తుతం కోడ్ లేకపోవడం,డిసెంబర్‌లో తిరిగి మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండడంతో ఆలయ ధర్మకర్తల మండలి నియమించేందుకు దేవాదాయశాఖ ఇటీవల నోటీఫికేషన్ జారీచేసింది. ఆసక్తిగల అర్హులు ఈనెల 28లోగా సంబంధిత ఎండోమెంట్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ముందుగా తమ నేతల అనుమతి తీసుకుని దరఖాస్తు చేసుకుంటే కమిటీలో చోటు ఖాయమనే నమ్మకంతో వారిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

### అమాత్యుల నజర్..

కొమురవెల్లి మల్లన్న ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటి. పదేండ్లుగా జనగామ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ సర్కారు ఆలయ కమిటీలో చోటు కల్పించింది. అలాగే హైదరాబాద్ నుంచి కొందరు దాతలకు స్థానం కల్పించింది. తాజాగా మల్లన్న ఆలయ కమిటీలో చోటు కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కావడంతో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖను కలిసి దరఖాస్తులు అందిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ నేతలో కీలకమైన అంజన్‌కుమార్ యాదవ్ సైతం గొల్ల,కురుమలకు కమిటీ చైర్మన్, సభ్యులను ఇవ్వాలని కోరుతూ ఆయన ఇద్దరు సభ్యులకు రెకమెండేషన్ చేశారు. జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గతంలో నియమించిన జంబో కమిటీలోని కొందరు సభ్యులను ధర్మకర్తల మండలిలో చోటుకల్పించి అందులో ఉన్న వ్యక్తినే చైర్మన్‌గా నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సైతం ఇద్దరు నాయకులను సభ్యులుగా నియమించాలని సిఫారసు చేసినట్లు తెలిసింది.

### అసలైన కార్యకర్తలకు మొండిచెయ్యి ?

కాంగ్రెస్ పార్టీ జెండామోసిన కార్యకర్తలు, నాయకులు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. కానీ, వాస్తవంగా అలా జరగడం లేదని కాంగ్రెస్ క్యాడర్ అస్తంతృప్తితో ఉంది. పార్టీకోసం కష్టపడిన వారికి కాకుండా ఇటీవల పార్టీలో చేరిన వారికి, ఒకే సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల, నర్మెట్ట మండలాలకు చెందిన ఇద్దరు నాయకులతో పాటు హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు నాయకులు చైర్మన్ రేసులో ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ జెండాలు మోయని వ్యక్తులకు పదవులు ఇవ్వవద్దని, పార్టీ పటిష్టానికి కృషిచేసిన వారికే నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలని, డబ్బులు ఉన్న నాయకులకే ప్రాధాన్యత ఇస్తే, ఇక మాకు ఎప్పుడు పదవులు వస్తాయని సీనియర్ కార్యకర్తలు, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఏడుపాయల్లో భక్తజన జాతర



మెదక్ జిల్లా ఏడుపాయల ఆలయంలో ఎదుట భక్తుల సందడి

పాపన్నపేట్, జూన్ 23 : మెదక్ జిల్లాలోని ఏడుపాయల వన దుర్గాభవానీ మాతను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఒడిబియ్యం పోసి, బోనాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ సతెల్లి బాలగౌడ, రవివీర్ కుమార్, సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి,తోట నర్సింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్ తదితరులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ,మురళీధర్, రాజశేఖర్ అమ్మవారికి పూజలు చేశారు. పాపన్నపేట్ ఎస్సై నరేశ్ తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

# పంచాయతీల భవనాలు పూర్తయ్యేనా..

- నిధుల కొరతతో అసంపూర్తిగా పనులు
- మూడుచోట్ల గ్రామ పాలనకు ఇబ్బందులు

గొటిగార్‌పల్లిలో అసంపూర్తిగా నిలిచిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం



కోహీర్, జూన్ 23: గ్రామ పాలనలో కీలకమైన గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో 24గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గొటిగార్‌పల్లి, ఖానాపూర్, కొత్తూర్‌లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కారు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో పనులను ప్రారంభించారు. ఖానాపూర్, గొటిగార్‌పల్లి గ్రామాల్లో స్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి. కొత్తూర్(కే) గ్రామంలో పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. ఈ మూడు గ్రామాల్లో పంచాయతీల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోవడంతో అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కోహీర్‌తో పాటు పోతిరెడ్డిపల్లి, మాచిరెడ్డిపల్లి, పర్సపల్లి గ్రామాల్లో కొత్త పంచాయతీ భవనాలను బీఆర్ఎస్ సర్కారు నిర్మించింది. వాటిలో సరిపడా గదులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు, గ్రామ పాలనకు జీపీలు దోహదపడుతున్నాయి. సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శికి ఓ గదిని కేటాయించారు. ఒక పెద్ద హాలు కూడా అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు నిర్మించారు. వాటి మాదిరిగానే గొటిగార్‌పల్లి, కొత్తూర్(కే), ఖానాపూర్ గ్రామాల్లో పనులను ప్రారంభించారు. కానీ, ఎన్నికల కోడ్ రావడం, నిధుల కొరతతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం స్పందించి వేగంగా పనులు పూర్తిచేసి జీపీ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# పలుచోట్ల కురిసిన వర్షం



ఆదివారం మునిపల్లి మండలంలో పొంగిపొర్లుతున్న బొడపల్లి-చిన్నచెల్మడ వాగు

మునిపల్లి, జూన్ 23: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. వారం నుంచి వర్షాలు లేక రైతులు దిగాలు చెందుతున్న క్రమం లో భారీ వర్షం కురవడంతో రైతులు సంబురపడుతున్నారు. ఇక ఎవుసం పనులు సాగుతాయని సంతోషం వ్య క్తం చేస్తున్నారు. భారీ వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు నీళ్లు చేరాయి. బొడపల్లి- చిన్నచెల్మడ గ్రామాల మధ్య వాగు పొంగి పొర్లడంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి.

# భూమికి బదులు భూమి ఇవ్వాలి

### ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులు ఆందోళన

రాయపోల్, జూన్ 23: రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్ మార్చాలని, బలవంతంగా భూములు గుంజుకుంటే భూమికి బదులుగా మరోచోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని ఎల్కల్, బేగంపేట గ్రామాల భూ నిర్వాసితుల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆదివారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో గ్రామ మాజీ సర్పంచ్ తౌర్రి కుమార్, ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ జగదీశ్ యాదవ్‌తో పాటు ఎల్కల్, బేగంపేట గ్రామాలకు చెందిన రైతులు ఎల్కల్ గ్రామంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమి ట్రిపుల్ఆర్ నిర్మాణంలో పోతే రోడ్డున పడతామన్నారు. బతుకుదెరువు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.భూమి కోల్పోతున్న ప్రతి రైతుకు 2013 భూహక్కుల చట్టం ప్రకారం భూమికి బదులు భూమి ఇవ్వాలన్నారు. మార్కెట్ విలువ కన్నా రెండింతలు అదనంగా నష్ట పరిహారం, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. చాలామందికి వ్యవసాయ భూమి తక్కువగా ఉందని, ఆ భూముల్లోనే కూరగాయలు పండించి బతుకుతున్నామని, తమ నోటికాడి బువ్వను ప్రభుత్వం గుంజుకుంటే తాము బతికేది ఎట్లా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ స్వామి, నాయకులు తౌర్రి మల్లేశం, సురేశ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం ఎల్కల్‌లో రైతుల ఆందోళన